కామెడీ కథ

# రూలంటే రూలే

**''ఆగాగు. బిళ్ల అతికించకు, నే వస్తున్నా'' సరిగ్గా అతనికి మూడున్నర అడుగుల దూరంలో నుంచున్న వెంకటాద్రి గాభరాగా అరిచాడు.**

తనకు చదవటం రాకపోయినా ఇంగ్లీషులో రాసి ఉన్న తన పేరును కళ్లతోనే చూసి పసికట్టగల నేర్పును తన సర్వీసులో అభ్యాసం చేసిన అటెండరు అక్బర్ అప్పటికే పుస్తకంలో తన పేరున్న లైను కింద పెట్టిన ఎడంచేతి చూపుడు వేలును బాణంలా పేజీ మీద ఈ చివరకు లాక్కొచ్చి ఆపి నాలిక మీద నానుతున్న రెవెన్యూ స్టాంపును కుడి చేత్తో బైటకు లాగి, వేలుపెట్టిన చోట అతికించేసి అరచేత్తో ధనాధనామని రెండు చరుపులు చరిచేశాడా స్టాంపుమీద.

కుర్రపెళ్లాన్ని అతుక్కుపోయిన కొత్త మొగుడిలా పేజీకి అంటుకుపోయింది స్టాంపు.

బీరువాలోంచి తీసిన ఫైలును హడావిడిగా పక్కనున్న స్టూలుమీద పడేసి, ఒక్క గెంతులో అక్బరు దగ్గరకొచ్చాడు వెంకటాద్రి.

అతని అరుపుకి, లాంగ్‌జంప్‌కి కలిపి పావు నిమిషం పట్టింది. అందులో సగం టైములోనే అక్బరు చేసిన స్టాంపు అతకింపు యాక్షను పూర్తయిపోయింది.

దగ్గరకొచ్చిన వెంకటాద్రి మాత్రం పుస్తకం వంక చూశాక అక్బరు వంక చూశాడు.

''అయింది. అనుకున్నంతా అయిపోయింది'' ఇందాకటి కన్నా గట్టిగా అరుస్తూ కుర్చీలో కూలబడ్డాడు వెంకటాద్రి.

అతని ఫీలింగ్ చూసి బిక్కచచ్చిపోయాడు అక్బర్. స్టాంపు అతికించింది తన పేరుకు ఎదురుగానా, కాదా అని ఇందాకటి చూపుడువేలు యాక్షన్ రిపీట్ చేసి చూసుకుని, ఔనన్నట్లుగా తలాడించుకున్నాడు అక్బరు. అంతా సరిగానే ఉన్నదనుకున్నాక. ''ఏమయింది సారూ, గట్ల పొలికేక పెట్టింద్రు? స్టాంపును నా పేరు తానే పెట్టితిని గదా!'' అడిగాడతను రెండు అరచేతులూ టేబిలు అంచున పెట్టి వెంకటాద్రి వేపు వంగుతూ.

''చేసింది క్షమించరాని తప్పు. పైగా అమాయకంగా ముఖం పెట్టి ఏమయింది సారూ అని అడుగుతావా?'' అక్బరు చేసిన తప్పుకు తాను కృంగిపోతూ తలదించుకున్న వెంకటాద్రి తలెత్తి చూసి మళ్లీ నిప్పులు కక్కాడు అతని మీద.

''రెవెన్యూ బిళ్లనే గదా నేనతకబెట్టింది. కవర్లనతకబెట్టే బిళ్లనైతే కాదు కదా!'' పూర్తి లాజిక్కు నిండిన పాయింటును అడ్డేశాననుకున్నాడు అక్బరు.

గ్రనేడ్ల మూటతో దేశం బోర్డరు దగ్గర దొరికిపోయి, ఇంకా బొంకుతున్న స్మగ్లరు వంక మిలిటరీ ఆఫీసరు ఉరిమి చూసినట్లు చూశాడు వెంకటాద్రి అక్బరు వంక.

''సంతోషించాం తెలివితేటలకి. అందులో సింహాన్నేం చేశావ్?'' ఇప్పుడు ఆర్యుమెంటు మొదలుపెట్టాడు వెంకటాద్రి.

''సింగమా? సింగమేంది సారూ?'' తన జీతానికి, సింహం తప్పిపోవడానికి లింకు అందక అడిగాడు అక్బర్.

వెంకటాద్రి చాదస్తం అర్థం చేసుకోలేక అక్బరు అనుభవిస్తున్న యమ బాధని చూడలేక పక్కనున్న సుధాకర్ ఒక్క క్షణం పని ఆపి అన్నాడు. ''అక్బరూ, స్టాంపులో ఉండే సింహం బొమ్మని నిటారుగా ఉండేలా కాకుండా తిరగేసి అతికించావు పుస్తకంలో. అది తప్పని సారు నీకు చెపుతున్నారు.''

అర్థ సెకనులో చక్కగా బుర్రకెక్కింది అక్బరుకు ఆ మాటలకర్థం. తలతిప్పి, అతికించిన స్టాంపునొకసారి చూసి, ''అట్లానా'' అంటూ అటు తిరిగి సింహాద్రితో అన్నాడు. అక్బరు 'గైతే ఏమిటైతది సారు? సింగం కరవనీకి వస్తదా? కండలు పెరుకుద్దా?'' బొమ్మ సింహాన్ని తిరగేస్తే వచ్చే నష్టం అక్బరు ఊహకందడం లేదు.

దేశభక్తి, చాదస్తం, ఆఫీసు పనిలో క్రమశిక్షణ ముప్పేట జడలా అల్లుకు పోయి మనసు పొరల్లో మందంగా పేరుకుపోయిన వెంకటాద్రికి ''నేను తప్పే చేశానని'' అక్బరు చేత అనిపించి ఎలా ఒప్పించాలో అర్థం కాక తలకొట్టుకున్నారు.

''నువ్ సరిగానే నుంచున్నావుగా. నీ కాళ్లెక్కడున్నాయ్?'' అడిగాడు వెంకటాద్రి.

''నేలమీద''

''తల?''

''పైకున్నది''

''మరి సింహాలనెందుకు తిరగేశావ్?''

''అగో మల్లా సింగమంటారు! బొమ్మసింగం ఎట్టుంటేనేంటంట'' పాడిన పాటే మళ్లీ అందుకున్నాడు అక్బరు.

ఇక అంతకంటే ఆ నస భరించలేక, వెంకటాద్రికి ఇటుపక్క కూర్చున్న జూనియర్ మోస్ట్ జూనియర్ అసిస్టెంటు జయరావు, ఓ పక్క భయపడుతూనే, ''ఏ కోడ్‌లో ఉందో, ఏ రూల్లో ఉందో ఈ రూల్ పొజిషన్ కాస్త చెపుతారా'' అన్నాడు. తాను ఈమధ్యనే ఎకౌంటు టెస్టుల కోసం చదివిన పరిజ్ఞానాన్ని డిఫెన్స్‌గా వాడుతూ.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పటానికి వెంకటాద్రి తడబడితే జయరావుకి పూర్తి వత్తాసు పలకడానికి చుట్టూ ఉన్న స్టాఫందరూ మనసుల్లోనే సిద్ధపడ్డారు.

చివ్వున తలతిప్పి చూశాడు వెంకటాద్రి. జయరావుని ''రూలు పొజిషను కావాలా నీకు? అయితే ఓ పని చెయ్యి. ఇంటికెళ్లాక, మీ ఆవిడా, నువ్వూ కలిసి ఉన్న ఫోటోని తిరగేసి గోడకి పెట్టి చూడు. మీ ఆవిడే చెపుతుంది చక్కగా రూలు పొజిషన్'' కుర్రాడివి నాకు చెపుతావా అన్నట్టు ఖస్సుమని లేచాడు వెంకటాద్రి.

వయసు, అనుభవం వెంకటాద్రికి నేర్పిన లౌక్యం. ఏ పుస్తకాలకు, రూల్సుకూ అందదని అర్థం అయిపోయింది జయరావుకి. మిగిలిన అందరికీ పచ్చి వెలక్కాయ గొంతుకడ్డపడింది.


ఆ తరువాత అదే వూపున అక్బరు మీద పడి, పుట్టినప్పటి నుండీ ఆ సింహం పిల్లల్ని తనే పెంచి పెద్ద చేసినంత మురిపెంగా వాటి ప్రాముఖ్యతను వివరించటం మొదలుపెట్టాడు వెంకటాద్రి.

ప్రసంగం వింటున్న అక్బరు సడెన్‌గా పక్కనున్న సదానందం వంక చూసి ''గీయనిట్లియ్యడుగాని, నే బోయి మా యూనియన్ లీడర్‌ని గుంజుకొస్తా. గాయన సూసు కుంటడు గీసింగాలేంటో, గీరూలేంటో'' అంటూ బైటకు వెళ్లాడు రుసరుసమంటూ.

భయపడలేదు వెంకటాద్రి. ''రానీ, అతనికీ, నీకూ కలిపి చెపుతా. అసలు రూలేంటో'' అంటూ స్వగతంగా అనుకున్నాడు.

యూనియన్ మెంబర్లు సెక్షన్లోకి అడుగుపెడితే వాళ్లు చేసే హంగామా తెలిసిన రాంచందర్ అతని వెనకే పరిగెట్టారు అక్బరును ఆపి, నచ్చజెప్పి తిరిగి తీసుకు రావడానికి.

అప్పటివరకూ నోరు మెదపని భుజంగరావు నెమ్మదిగా వెంకటాద్రి సీటు దగ్గరకొచ్చి చాలా బాధగా ముఖం పెట్టి, ''ఏంటిది బాబాయ్‌గారా? మాకెవ్వరికీ తెలీని రూలును వెతికి తీసి, అతనికి ఒక ఇంక్రిమెంటు బెనిఫిట్ ఇస్తున్నదీ మీరే, కష్టపడి ఎరియర్స్ బిల్లు రాసి, వాడికి ఆరువేల రూపాయలు ఇప్పిస్తున్నదీ మీరే. మీరు దేవుడని ఆఫీ



సులో ప్రతి ఒక్కరి దగ్గరా చెప్పుకున్నాడం వాడు. అంత కష్టపడి, అతనికి ఉపకారం చేసి, చివరకు స్టాంపు అతికించడంలో వాడికి అర్థంకాని, అవసరం లేని విషయాలు చెప్పి, అతని చేత చెడ్డవాడనిపించుకుంటారెందుకు? మీరు పడ్డ కష్టం, మీ తెలివితేటలు అన్నీ బూడిదలో పోసిన పన్నీరేగా!'' అన్నాడు.

''అది కాదు భుజంగం. నేనేమన్నా తప్పు మాట్లాడానా చెప్పు. స్టాంపుని తిరగేసి అంటిస్తే వచ్చిన నష్టం ఏవిటంటాడా వాడు?'' ఇంకా ఆవేశం దిగలేదు వెంకటాద్రికి. అంతేకాదు తను మాట్లాడేది అప్రస్తుతం అని కూడా అనిపించలేదు అతనికి.

డిపార్టుమెంట్ రూల్సుకి తిరగేసి అర్థం చెప్పి కూడా, అందరిచేతా ఔననిపించగల దిట్ట వెంకటాద్రి. తన తెలివితేటల్తో ఎంతో మంది తోటి ఉద్యోగులకు ఉపకారాలు చేశాడు. డిపార్టుమెంటు టెస్టులు పాస్‌కాని జూనియర్లకు అడక్కుండానే బుక్స్ అందించి ప్రోత్సహించి పరీక్షలు రాయించేవాడు.

ఇంతటి సుగుణాభిరాముడికి భగవంతుడు తీరని అన్యాయం ఒకటి చేశాడు. మనుషులందరికీ 'వేపకాయం'త ఉండే వెర్రిని వెంకటాద్రికి మాత్రం తలకాయలోని సగం చోటులో పరిచి సర్దేశాడు. దాంతో అతను 'కొని' తెచ్చుకునే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. పని చివరల్లో అతను చూపించే 'అనవసరపు చాదస్తం' అపార్థాలకు దారి తీసి, దేవుడిలా కనపడాల్సిన వెంకటాద్రి దెయ్యంలా అనిపించేవాడు. ఉపకారం చేసి, శత్రుత్వాన్ని కొనితెచ్చుకునే వాడు వెంకటాద్రి.


★ ★ ★

యాభై ఎనిమిదేళ్ల వయసు నిండిన సాంబశివం రిటైర్‌మెంట్ రోజది. స్టాఫంతా అతనికి సెమినార్ హాల్లో ఆ సాయంత్రం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు.

ఆ హాల్లోని మగవాళ్లంతా కేడర్ల వారీగా గుంపులుగా చేరి తమ తమ బాసుల మీద జోకులు పేల్చుకుని నవ్వుకుంటున్నారు. అనుమానం వచ్చి బాసులిటు చూడగానే ''పిలిచారా సార్'' అంటూ వినయంగా దగ్గరకెళ్లి వస్తున్నారు. అలా రిలాక్సైపోతున్నారు.

ఉద్యోగస్తుల్లోనే ''టెన్షనా?... అంటే ఏవిటి?'' అని అడిగే జాతి మరొకటి ఉంది. అది స్త్రీలింగానికి చెందిన 'ఉద్యోగినుల' జాతి. వాళ్లంతా ఆ హాల్లోనే మరోపక్క మరో మాయాలోకంలో మునిగిపోయి ఉన్నారు. వాళ్ల కళ్లు, వేళ్లూ ఎప్పుడూ మరొకావిడ కట్టుకొచ్చిన చీరమీద, పెట్టుకొచ్చిన దుద్దుల మీద, వేసుకొచ్చిన గొలుసు మీద తారట్లాడుతుంటాయి. ఏదోలా మాట కలిపి, వాటిని చేత్తో తాకి వదిలితే గానీ వీళ్లకి తృప్తి కలుగదు.

ఈ రెండు లోకాలూ వదిలి, మరో మూడో లోకంలో



తిరుగా డుతున్నాడు మౌనంగా ముందు వరుసలో కూర్చున్న వెంకటాద్రి. నిమిషానికి రెండు నిమిషాలకు ఒకసారి జేబులోంచి తీసిన కాగితాన్ని మడతలు విప్పి, రెండు సెకన్లు చదివి, తిరిగి జేబులో పెట్టుకుంటున్నాడు.

ఆ రోజు పార్టీ బాగా జరిగింది. ఆ పార్టీ అయిపోగానే రివాజుగా బొకేలు, దండలు, మెమెంటోలూ అన్నీ కార్లో పెట్టి, సాంబశివాన్ని ఆఫీసు కారులో ఇంటికి సాగనంపారు. కారు బయలుదేరబోతుండగా తన లంచ్ బాక్స్‌తో హడావుడి పడుతూ వచ్చి కారెక్కాడు వెంకటాద్రి.

కారు ఇంటికి చేరేసరికి సాంబశివం కొడుకులూ, కూతుళ్లూ, కోడళ్లు, అల్లుళ్లు అందరూ బయటకొచ్చి అతన్ని లోపలికి తీసుకెళ్లారు. హాల్లో కూర్చోపెట్టి చుట్టూ చేరి సరదాగా మాట్లాడుకుంటున్నారు. ఆఫీసు నుండి అతనితో వచ్చిన మరో ఇద్దరు స్టాఫ్ మెంబర్లని మర్యాద చేసి కూర్చోబెట్టింది సాంబశివం భార్య.

**శారదా ప్రసాద్**

ఆ కోలాహలంలో వెంకటాద్రి మాత్రం అందరిలా హుషారుగా లేడు. తను వచ్చిన పని మీదనే ఉంది అతని మనసంతా. అందరిలో ఎవర్నో వెతుకుతూ చుట్టూ చూస్తున్నాడు.

ఇరవై రెండేళ్ల సాంబశివం పెద్దకొడుకుని చూడగానే అతని కళ్లు మెరిశాయి. వెనక నుంచి అతని భుజంమీద తట్టి ''బాబూ, నీతో ఒకసారి విడిగా మాట్లాడాలి'' అన్నాడు.

''అర్జంటా అంకుల్'' అన్నాడా అబ్బాయి గాబరాగా. ఎటువంటి ఫీలింగూ లేని వెంకటాద్రి బిక్క మొఖం చూస్తూ.

''అర్జెంటు కాదు కానీ, ముఖ్యమైన విషయం'' మేడమీద గదిలోకి తీసుకెళ్లాడా అబ్బాయి వెంకటాద్రిని. గదిలో సోఫాలో కూర్చున్నాక, అతనికి దగ్గరగా జరుగుతూ ''మీ నాన్నగారి గురించే ఒక విషయం చెప్పాలి బాబూ'' అన్నాడు వెంకటాద్రి జేబులోంచి మడతల కాయితం బయటకు తీస్తూ.

''మమ్మీని కూడా పిలవమంటారా అంకుల్'' అన్నాడా అబ్బాయి కంగారు పడుతూ.

''ఒద్దొద్దు. నువ్వు వినటమే ముఖ్యం. ఒక విధంగా ఉద్యోగస్తులకు ఒక వరం ఇది'' అన్నాడు వెంకటాద్రి ఉపోద్ఘాతంలా. విషయం మంచిదేననిపించి, ఇక మాట్లాడలేదా అబ్బాయి. గొంతు సవ

రించుకుని చెప్పటం మొదలెట్టాడు వెంకటాద్రి.

''బ్రతికి ఉండగా తన ఉద్యోగి బాగోగులు చూస్తూ ఎంత గౌరవం ఇస్తుందో, అదే గౌరవం అతను చచ్చిపోయాక కూడా ఇస్తుంది మన ప్రభుత్వం. రిటైరైన ఉద్యోగి చనిపోతే, అతని దహనకాండ ఖర్చుల నిమిత్తం రెండు వేల రూపాయలిస్తుంది'' అంటూ చెప్పి కాగితం మీద రాసుకొచ్చిన సదరు జీవో నెంబరూ, తారీఖు చదివి వినిపించాడు వెంకటాద్రి. విషయాన్ని శ్రద్ధగా వివరించటంలో మునిగిపోయిన వెంకటాద్రి, సాంబశివం పెద్దల్లుడు, పెద్దకూతురు అతని వెనక, గుమ్మం దగ్గర నుంచుని ఆ మాటలు వింటున్నట్లు గమనించలేదతను.

అతను చెప్పిన విషయంలో ఏదో అపశ్రుతి వినిపించినా, పెద్దవాడు తనకు తెలిసింది చెపుతున్నాడని మనసులో సర్దిచెప్పుకుంటూ మేడమెట్లు దిగబోయారిద్దరూ.

సరిగ్గా అప్పుడే వెంకటాద్రి గొంతు మళ్లీ వినపడింది.

''చూడు బాబూ, ఈ విషయం తేలిగ్గా తీసుకోకు. రిటైరయిన తరువాత రెండు వేల రూపాయలు మనకి ఇచ్చే దాతలుండరు. పెద్దకొడుకువి నువ్వే కాబట్టి నీకే చెబుతున్నా. ఆ రోజు మాత్రం బద్ధకించకు. బాడీ వాకిట్లో ఉండగానే ఆఫీసు వాళ్లకి తెలియబరచాలి. నిమిషాల్లో తెచ్చిస్తారు రెండువేలు. ఆ రోజు ఆదివారం అయితే, మర్నాడు చెప్పినా డబ్బులిస్తారు'' అన్నారు.

అర్థం కానట్టు చికాగ్గా చూశాడా అబ్బాయి. కానీ, అది విన్న వాళ్ల అక్కాబావలు ఒకేసారి అడవి పులుల్లా వచ్చి వెంకటాద్రి మీద పడ్డారు. ఇంకా వివరించబోయాడు వెంకటాద్రి. రెచ్చిపోయిన ఆ ఇద్దరూ అతన్ని మేడమీద నుంచి కిందకు తోసేసినంత పని చేశారు.

వెంకటాద్రిని అతని ఇంటి దగ్గర దింపి, బయలుదేరబోతూ అన్నాడు నీలకంఠం.

''చెల్లెమ్మా, మనవాడికి బుర్ర బాగా రిపేరు చేసి, అతన్ని మార్చే గట్టి ప్రయత్నం ఏదో చెయ్యమ్మా, లేకపోతే తన్నులు కూడా తినేలా ఉన్నాడు బయట'' అన్నాడు.

''తినబోవటం ఏవిటన్నయ్యగారు, తిన్నారొకసారి కానిస్టేబుల్ చేత'' అంది ఈ విషయం మీకు తెలీదా అన్నట్టు వెంకటాద్రి భార్య.

బయలుదేరబోయిన ఇద్దరూ మళ్లీ కూర్చుంటూ అడిగారు. ''ఏం జరిగింది'' అని.

''పరోపకారి బుద్ధి లేని వాళ్లకి అన్ని పనులూ అపసవ్యప్పనుల్లాగే కనబడతాయి'' అని గొణుక్కుంటూ అక్కడి నుండి లేచి మరో గదిలోకి వెళ్లిపోయాడు వెంకటాద్రి. లోపలికి వెళ్లిపోతున్న వెంకటాద్రిని ఒకసారి కోపంగా చూసి, అన్నదామె.

''మీరు చెప్పండన్నయ్యగారూ. ఇద్దరం కలిసి సినిమాకి వెళితే ఎన్ని టికెట్లు కొంటాం?''

''అందులో తెలిందేం ఉందమ్మా? రెండు టిక్కెట్లు!'' అన్నాడు నీలకంఠం.

''ఎప్పుడు మేం ఇద్దరం సినిమాకెళ్లినా, నన్ను లైన్లో నిలబెట్టి, నాచేత ఎన్ని టికెట్లు తీయిస్తారో తెలుసా అన్నయ్యగారూ ఈయన?...నాలుగు!!'' అందావిడ నాలుగు వేళ్లు చూపించి, కళ్లు పెద్దవి చేస్తూ.

''ఇద్దరికి నాలుగెందుకమ్మా? ఏం చేసుకుంటాడు మిగతా రెండూ?''

''నా టిక్కెట్టు నా చేతికిచ్చి, హాల్లోకి పంపి, మిగతా టిక్కెట్లు పట్టుకు బయట నిలబడతారు.''

''నిలబడి?''

''అక్కడే నిలబడి, టిక్కెట్లయిపోయాక వచ్చే ఒక భార్యాభర్తల జంటకి ఇస్తారట.''

''ఎందుకలా?''


''ఆ జంట సంతోషిస్తే, అది మా జంటకు చల్లదనం అంటారు ఈయన''

''మరి బ్లాక్‌లో అమ్ముతాడా?''

''బ్లాకా, ఖర్మా... అసలు డబ్బులకే''

## వేదాంతం

**ఊర్మిళకి షాపింగ్ అంటే ఇష్టంట. విదేశాల్లో షూటింగ్‌లకి, సరదాగా టూర్‌లకి వెళ్లినప్పుడు ఊర్మిళ విపరీతంగా షాపింగ్ చేస్తుందిట. షాపింగ్ అంతా ముగిశాక ఆకాశాన్నంటే బిల్లు చూసి షాక్‌కి గురవుతుందిట. 'మనం సంపాదించేదంతా మన అవసరాలకి, విలాసాలకే ఖర్చుపెట్టాలనుకుంటాం. మనం సంపాదించింది మన కోసమే కదా' అంటోంది వేదాంతధోరణితో.**



''మరి తన్నులెలా తిన్నాడమ్మా?''

''ఓ రోజు ఈయనిచ్చిన టిక్కెట్లు తీసుకున్న ఓ కుర్రదాని మొగుడు వంద నోటిచ్చి, చిల్లరివ్వమన్నాట్ట. నోటు అల్లల్లాడిస్తూ చిల్లర కోసం అటూ ఇటూ తిరుగుతోంటే, దూరం నించి అంతా చూసిన కానిస్టేబులు దగ్గరకొచ్చి నోటు లాక్కున్నాట్ట. డబ్బులు తిరిగివ్వమని కాళ్లావేళ్లా పడ్డా, ఇవ్వకపోగా లాఠీతో నాలుగంటించాట్ట ఆ పోలీసు. చివరికి సినిమా హాల్లో కూర్చున్న నా దగ్గరకొచ్చి, డబ్బులడిగి పట్టుకెళ్లి ఆ కుర్రాడికిచ్చి దణ్ణం పెట్టొచ్చారీయన.''

''అయ్యో పాపం''

''పాపం ఏమిటి అన్నయ్యగారూ, నా ప్రారబ్ధం. ఇంత జరిగినా, మరుసటి ఆదివారం సినిమాకెళ్లినపుడు మళ్లీ కథ మామూలే.''

మూతి ముడుచుకుని లోపల కూర్చుని అంతా వింటున్న వెంకటాద్రి 'వెర్రిదానికి వెర్రివాళ్లు బాగా దొరికారు, ఇది చెప్పటానికి, వీళ్లు వినటానికీను. ఇలాంటి వాళ్లు పోగుబడితే దేశం ఎలా బాగుపడుతుంది? ఎన్నాళ్లకని బాగుపడుతుందీ?' అంటూ గొణుక్కున్నాడు బాధగా.

ఎందుకంటే జీవితంలో ఎటువంటి పరిణామాన్ని లెక్కచేయని వెంకటాద్రికి 'రూలంటే రూలే.' ★